సాక్షి
వికారాబాద్

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



విద్య, వైద్యానికి ప్రాధాన్యం

ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. 8లో▸



రాజీ మార్గమే రాజ మార్గం

రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



పరిగి అభివృద్ధే లక్ష్యం

పరిగి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్య మని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రేపటి ప్రజావాణి రద్దు

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణిని సోమవారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్–2 పరీక్షల నేపథ్యంలో అధికారులందరూ పరీక్ష విధులకు హాజరు కావాల్సి ఉండడంతో ప్రజావాణిని రద్దు చేసినట్లు తెలిపారు. ఇట్టి విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు

ఎకరాకు 125గజాలు

అనంతగిరి: కొడంగల్ మండలం అప్పాయిపల్లి శివారలోని సర్వేనంబర్ 19లో ప్రభుత్వ మెడికల్, వెటర్నరీ కళాశాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులకు డీటీసీపీ లేఅవుట్‌లో ఒక ఎకరానికి 125గజాల ప్లాటు చొప్పున ఉచితంగా రిజిస్ట్రేషన్‌లు చేయిస్తామని.. వచ్చే వారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభిస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేద్దాం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి తదితరులు

కుల్కచర్ల: మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం, పాంబండ ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమాల నిమిత్తం కుల్కచర్ల మండలానికి విచ్చేస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖల పర్యటనను విజయవంతం చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం మంత్రుల పర్యటన నేపథ్యంలో మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో పూజాకార్యక్రమాలను, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, ప్రధానకార్యదర్శి గోపాల్ నాయక్, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, ఏఎంసీ డైరెక్టర్ రాంచంద్రయ్య తదితరులున్నారు.

గ్రూప్‌-2కు 30 కేంద్రాలు

- నేడు, రేపు పరీక్షలు
- హాజరుకానున్న 10,381 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్లు

వికారాబాద్: గ్రూప్–2 పరీక్షల నిర్వాహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న ఈ పరీక్షలు ఆది, సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీ ర్, ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు ఏర్పా ట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో మొత్తం 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో వికారాబాద్ పట్టణంతో పాటు తాండూరు, పరిగిలలోనూ సెంటర్లు ఏర్పాటు చేశారు. వికారాబాద్‌లో ఏడు, తాండూరు, పూడూరు మండలాల పరిధిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రాల్లో 10,381 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఆయా శాఖల జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు.

పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ సర్వీసులు

పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. కేంద్రాల్లో శానిటేషన్, సీసీ కెమెరాల ఏర్పాటు, వాష్ రూమ్‌ల నిర్వహణ, బెంచీలు, టేబుల్స్, ఫ్యాన్లు, మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, విద్యుత్, తాగునీటి సౌకర్యం, అందుబాటులో హెల్త్ సిబ్బంది, తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో అందుకు అవసరమైన పరికరాలు సమ కూరుస్తున్నారు. వికారాబాద్‌లోని రైల్వే స్టేషన్, బస్టాండు, ఎన్టీఆర్ చౌరస్తాల నుంచి పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ బస్సులు నడపనుంది.

ఎగ్జామ్ సెంటర్స్ వద్ద 144 సెక్షన్

వికారాబాద్ పట్టణంతో పాటు మండల పరిధిలో 14 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పూడూరు మండలంలో 01, పరిగి నియోజక వర్గ కేంద్రంలో 04, తాండూరులో 11 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు సైతం వారి శాఖాపరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షలు నిర్వహించే మండలాల్లో పరీక్షల సమయం ముగిసే వరకు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా పత్రాలు ఎస్కార్టుతో తీసుకువెళ్లేలా బందోబస్తు చర్యలు చేపట్టారు.

పీడకల.. చెదిరేదెలా!



హీర్యా నాయక్ ఇంటి ఎదుట దిగాలుగా బంధువులు

జైలులో మా వాళ్లు ఎట్లున్నరో!

- ప్రాణాలతో బయటకు వస్తారా.. శవాలుగా అప్పగిస్తారా?
- 'లగచర్ల' బాధిత కుటుంబాల్లో టెన్షన్
- నెల రోజులుగా బెయిల్ దొరకని పరిస్థితి
- ప్రభుత్వం తమపై కక్షకట్టిందని గిరిజనుల ఆందోళన
- ఎవరిని కదిలించినా కన్నీటి గాథలే..

లగచర్ల ఘటనలో చేయని తప్పులకు కేసుల పాలై, జైలులో మగ్గుతున్న తమ వాళ్లు ఎలా ఉన్నారోనని లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంటతండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న వారిపై అక్రమ కేసులు బనాయించారని వాపోతున్నారు. అధికారులపై జరిగిన దాడిలో.. పాల్గొనని వారిని సైతం కేసుల్లో ఇరికించారని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ ఘటనలో ఇప్పటికే 45 మందిని అరెస్ట్ చేసి జైలుకు పంపగా.. మరికొంత మంది వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తుండడంతో మూడు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రభుత్వం తమపై ఎందుకు ఇంత కక్షకట్టిందోనని వాపోతున్నారు.

ఎరుకల రమేష్, దుద్యాల్

వ్యవసాయం, కూలీ పనులు చేసుకుని బతుకుతున్న తమ జీవితాల్లో నవంబర్ 11 చెరగని పీడకలగా మారిందని గిరిజన కుటుంబాలు వాపోతున్నాయి. అధికారులపై దాడి చేశారనే అర్ధరాత్రి వేళ ఇళ్లలో చొరబడిన పోలీసులు మహిళలతో అమానవీయంగా వ్యవహరించారని, కనిపించిన వృద్ధులు, యువకులు తేడా లేకుండా కనిపించిన మగవారినందరినీ కర్కశంగా లాక్కెళ్లారని పేర్కొన్నారు. ఆరోజు నుంచి ఇప్పటి వరకూ తమ వాళ్లు ఇల్లు చేరలేదని రోదిస్తున్నారు. పని చేసే వాళ్లందరూ జైలుకి వెళ్లడంతో పొలం, గోదాగొడ్డు ఆగమయ్యాయని, బాపు ఎప్పుడొస్తాడని పిల్లలు తండ్రి కోసం ఏడుస్తున్నారని కన్నీటి పర్యంతమవుతున్నారు. సంగారెడ్డి జైలులో శిక్ష అనుభవిస్తున్న హీర్యానాయక్‌కు గురువారం గుండె నొప్పి రావడంతో జైలులో ఉన్న తమవారి ఆరోగ్య సమస్యలపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మా వాళ్లు ప్రాణాలతో ఇంటికి వస్తారా? లేదా? అనే అనుమానం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులు గడుస్తున్నా బెయిల్ రాక నిరీక్షణ తప్పడం లేదంటున్నారు. ఈ నెల 11న బెయిల్ వస్తుందని భావించామని, విచారణ 24కు వాయిదా పడడంతో నిరాశ తప్పలేదని చెబుతున్నారు. బెయిల్ ఎప్పుడు వస్తుందని లాయర్లను అడిగినా వారూ ఖచ్చితమైన హామీ ఇవ్వకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హీర్యా నాయక్‌కు గుండెపోటు వచ్చినా జైలు అధికారులు చేతికి పెద్ద గొలుసు కట్టుకుని తీసుకురావడంపై తండా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి 24న అయినా బెయిల్ వచ్చేలా కృషి చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. లేదంటే తమనైనా జైలుకు పంపాలంటున్నారు.

బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాడు



నా భర్త నీరటి హన్మంతు ప్రస్తుతం సంగారెడ్డి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఆయన కొంత కాలంగా బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాడు. వాటితో పాటు ఆపరేషన్ సైతం అయింది. ఇంటి దగ్గరే ఎంతో ఇబ్బంది పడే వాడు. జైలులో ఎలా ఉంటున్నాడో ఏమో? భయంగా ఉంది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తికే గుండెపోటు వచ్చింది. న్యాయస్థానం వెంటనే బెయిల్ మంజూరు చేయాలి.

– వెంకటమ్మ, హన్మంతు భార్య, లగచర్ల

గుండె ఆపరేషన్ అయింది



నాభర్త గోపాల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఎనిమిది నెలల క్రితమే గుండె ఆపరేషన్ అయింది. ఎద భాగంలో పెద్ద కణితి ఉంటే ఆపరేషన్ చేసి తొలగించారు. జైలులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అని ఫోన్‌లో చెప్పాడు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. ముఖ్యమంత్రి స్పందించి మా వాళ్లను ప్రాణాలతో పంపిస్తే చాలు. అధికారులు మాకు న్యాయం చేయాలి.

– మంజుల, లగచర్ల

సంకెళ్లు ఎందుకు?



హీర్యా నాయక్‌కు గురువారం ఛాతిలో నొప్పి రావడంతో జైలు అధికారులు సంకెళ్లు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లడం ఎంత వరకు సమంజసం, పరిస్థితి విషమించేంత వరకు అధికారులు ఏం చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మా మామని చూసేందుకు కూడా అనుమతి ఇవ్వడం లేదు. మా అత్తను మాత్రమే అనుమతించారు. మా మామను ప్రాణాలతో ఇంటికి పంపించాలి. ప్రభుత్వం కేసులు ఎత్తివేసి అందరినీ విడుదల చేయాలి.

– అనిత, పులిచర్లకుంటతండా

15 రోజుల్లో డెలివరీ



నా భర్త ప్రవీణ్ జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. నేను తొమ్మిది నెలల గర్భిణిని. మరో 15 రోజుల్లో డెలివరీ ఉంది. ఈ నెల 11న బెయిల్ వస్తుందన్నారు. కానీ రాలేదు. విచారణ 24కు వాయిదా వేశారు. ఇంట్లో ఒక్కదాన్నే ఉంటున్నా. నాకున్న ఒక్క తోడు జైలులో ఉన్నాడు చాలా భయంగా ఉంది. ఎన్నికలప్పుడు రేవంత్ రెడ్డి పులి అంటూ ఓట్లు వేయించాడు. కానీ ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి మా ఆయన్ను జైలు పాలు చేశాడు. మా ఆయనను విడిచిపెట్టాలి.

– జ్యోతి, ప్రవీణ్ భార్య, రోటిబండతండా



ఒకే వక్కడు

సండే స్పెషల్

డాక్టర్ టు ఫార్మర్

- వైద్య రంగం నుంచి వ్యవసాయం వైపు..
- వక్కల పంటలో సక్సెస్
- శంకర్‌పల్లి శివారులో సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న డా.విజయ్‌కుమార్ కొడాలి

వైద్య రంగంలో దాదాపు నాలుగు దశాబ్దాలు పనిచేశారు.. అయినా ఇంకా ఏదో సాధించాలన్న తపన.. వైద్య రంగానికి స్వస్తి పలికారు.. కొత్తగా ఏదైనా ప్రయత్నించాలని ఆలోచించారు.. అక్కడక్కడ రీసెర్చ్‌లు చేశారు.. చివరికి వినూత్నంగా వక్కల సాగు వైపు అడుగులు వేశారు.. అద్భుత ఫలితాలు సాధించారు.. ఆయనే డా. విజయ్‌కుమార్ కొడాలి. తెలంగాణలోనే ఈ పంట సాగు చేస్తున్న ఒకే 'వక్క'డిగా నిలిచారు.

– దొడ్ల భాస్కర్ రెడ్డి
శంకర్‌పల్లి



ఎండబెట్టేందుకు తరలిస్తున్న వక్కలు

వివరాలు 8లో▸

ఫ్యూచర్ గోల్ ఏమిటి?

విద్యార్థులపై సీఎం ప్రశ్నల వర్షం

- పండుగ వాతావరణంలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవం
- చిలుకూరు గురుకులంలో ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- గంటకు పైగా ఇక్కడే సరదాగా గడిపిన ముఖ్యమంత్రి
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మొయినాబాద్: 'ఎక్కిడి నుంచి వచ్చావ్.. ఏ క్లాస్ చదువుతున్నావ్.. ఫ్యూచర్ గోల్ ఏమిటి.. కామన్ మెనూ, కాస్మోటిక్ చార్జీల పెంపుపై నీ ఫీలింగ్?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులపై ప్రశ్నల వర్షం కురిపించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన శనివారం చిలుకూరు గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. గురుకులంలో మౌలిక సదుపాయాలు, వడ్డిస్తున్న ఆహారం, బోధన పద్ధతులపై ఆరా తీశారు. తొమ్మిదో తరగతి చదివే నందకిషోర్ 'చదువే జ్ఞానం.. చదువే ధైర్యం.. చదువే లక్ష్యం' అంటూ ఆలపించిన గీతానికి అబ్బురపోయారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మృదంగ విన్యాసాన్ని ఆసక్తిగా వీక్షించారు. వివిధ సంక్షేమ హాస్టళ్లలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్లు, చెక్కులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సుమారు 38 నిమిషాల పాటు ఆయన ప్రసంగించారు. చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని పేర్కొన్నారు. మల్టీ టాలెంటెడ్ హబ్‌లుగా గురుకులాలను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. చిలుకూరు గురుకులంలో సుమారు గంటా 45 నిమిషాల పాటు సీఎం గడిపారు. కార్యక్రమంలో శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కార్యదర్శి అలుగు వర్షిణి, కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ సర్పంచ్‌లు స్వరూప ఆంద్రూ, మల్లేష్‌యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంరెడ్డి, నాయకులు మహేందర్ ముదిరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

టాలెంటెడ్ హబ్‌లుగా..

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను పోటీ ప్రపంచానికి దీటుగా తీర్చిదిద్దుతున్నాం. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి మల్టీ టాలెంటెడ్ హబ్‌లుగా తయారు చేస్తున్నాం. 3,500 గురుకులాల్లో కామన్ మెనూ ప్రారంభించడం అభినందనీయం. అంతర్జాతీయ స్థాయిలో నియోజకవర్గానికి ఒకటి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గురుకులాల్లో 8 వేల ఉపాధ్యాయ పోస్టులు, డీఎస్సీ ద్వారా మరో 11 వేలు పోస్టులు భర్తీ చేశాం.

– శ్రీధర్, సోషల్ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి

హాస్టల్‌లోనే చదివా..

నేను కూడా సంక్షేమ హాస్టల్‌లోనే చదువుకున్నా. ఆ రోజుల్లో కడుపునిండా అన్నం కూడా దొరికేది కాదు. ప్రస్తుతం ఆ పరిస్థితిలేదు. సన్న బియ్యంతో వడ్డిస్తున్నాం. దళిత హాస్టల్‌లో కామన్ మెనూ ప్రారంభించడం,సీఎం ముఖ్యఅతిథిగా రావడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం. చేవెళ్ల నియోజకవర్గం నగరానికి సమీపంలో ఉంది. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. పంచాయతీ రోడ్లకు రూ.300 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ.200 కోట్లు ఇవ్వండి. మెరుగు పర్చుకుంటాం.

– కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే

కార్పొరేట్‌కు దీటుగా ..

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతాం. భవిష్యత్తులో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. విద్యార్థులను ప్రోత్సహిస్తాం. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందించాలి. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి.

– పట్నం మహేందర్‌రెడ్డి, శాసనమండలి చీఫ్‌విప్



ఎండ బెట్టిన వక్కలను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్‌

ఒకే వక్కడు

సండే స్పెషల్‌

శంకర్‌పల్లి: నిజామాబాద్‌ జిల్లా బోధన్‌కు చెందిన విజయ్‌కుమార్‌ కొడాలి ఇంటర్‌ బోధన్‌లో, ఉస్మానియాలో ఎంబీబీఎస్‌ పూర్తి చేసుకున్నారు. 1979లో తన స్నేహితురాలు, క్లాస్‌మేట్‌ డా.విజయలక్ష్మి(గైనకాలజిస్ట్‌)ని వివాహం చేసుకున్నారు. ఇద్దరూ డాక్టర్లే కావడంతో తొలుత విదేశాలకు వెళ్దామనుకున్నారు. మళ్లీ ఆలోచించి ఇక్కడ హాస్పిటల్‌ పెట్టి సేవలందించాలన్న నిర్ణయానికి వచ్చారు. ఐడీపీఎల్‌ బాలానగర్‌ వద్ద కొడాలి నర్సింగ్‌ హోమ్‌ని స్థాపించారు. అది కొన్ని రోజుల్లోనే అంచలంచెలుగా వృద్ధి చెందడంతో 60 పడకల ఆస్పత్రిగా మార్చారు. కొన్ని వేల మందికి చికిత్సలు అందించారు.

విరామం తర్వాత ఇలా..

దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా వైద్య రంగంలో సేవలందించిన డా.విజయ్‌కుమార్‌ ఆ రంగంలో విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. తండ్రి వెంకటేశ్వరరావు వ్యవసాయ విద్యార్థి కావడంతో మందు నుంచి వ్యవసాయంపై మక్కువ ఎక్కువ. దీంతో ఆ రంగం వైపు దృష్టి సారించాలనుకున్నారు. ఓసారి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరులో ఉన్న తన స్నేహితుడు విజయ సారథి దగ్గరకు వెళ్లాడు. ఆయన అప్పటికే 30 ఏళ్ల నుంచి వక్కల సాగు చేస్తుండడంతో విజయ్‌కుమార్‌ సైతం ఆసక్తి కనబరిచారు. ఇందులో భాగంగా శంకర్‌పల్లి మండలం మాసానిగూడలో 2008లో తాను కొనుగోలు చేసిన 9 ఎకరాలను ఎంచుకున్నారు.

మెలకువలు తెలుసుకుని..

తొమ్మిది ఎకరాల్లో మొదటగా నాలుగెకరాల్లో వక్క సాగు చేసేందుకు నిర్ణయించుకున్నారు. ముందుగా పంట సాగులో మెలకువలు తెలుసుకున్నారు. మొక్క పెరిగేంత వరకు ఎండ ఎక్కువ పడకుండా 2015లో మల్బరీ మొక్కలు నాటారు. అవి కొంత పెద్దయిన తర్వాత 2017లో 1,200 వక్క మొక్కలను ఏలూరు నుంచి రూ.30 చొప్పున కొనుగోలు చేసి తెచ్చారు. ఒక్కో మొక్కకు రూ.30 చొప్పున ఇచ్చి నాటించారు. ఎకరంలో 700 దాకా నాటేందుకు అవకాశం ఉన్నా 300 మొక్కలు మాత్రమే నాటించారు. మొక్కకి మొక్కకి మధ్య 12 ఫీట్ల దూరం, 8 ఫీట్ల వెడల్పు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. తర్వాత వాటికి సహజసిద్ధంగా లభించే ఆముదం పిండి, ఆవాల పిండి, వేప గింజలు పొడి, వర్మీ కంపోస్టు ఎరువు, తక్కువ మోతాదులో రసాయన ఎరువులు వినియోగించారు. డ్రిప్‌ పద్ధతి ద్వారా నీటిని అందిస్తున్నారు. తొలుత వేసిన మల్బరీ వేప చెట్లను రెండేళ్ల తర్వాత కత్తిరించి అమ్మేయగా రూ.4 లక్షల ఆదాయం వచ్చింది. తర్వాత వాటి స్థానంలో కొబ్బరి మొక్కలు నాటారు. వచ్చే ఏడాది నుంచి కొబ్బరికాయల ఉత్పత్తి జరిగే అవకాశం ఉంది.

మార్కెట్‌లో కిలో రూ.350పైనే..

ఒక్కో మొక్కను తెచ్చి నాటేందుకు రూ.60, డ్రిప్‌ కోసం రూ. 1.50 లక్షలు, ఏడాదికి రూ.50వేల సేంద్రియ ఎరువులు, కూలీల ఖర్చు ఉంటుందని డా.విజయ్‌కుమార్‌ తెలిపారు. సెప్టెంబర్‌ నుంచి పంట ప్రారంభమై ఫిబ్రవరిలో అయిపోతుందన్నారు. వక్కలను తీసి ఎండ బెట్టడానికి సోలార్‌ పరికరాలను వినియోగిస్తున్నామని దీనికి పది రోజులు పడుతుందని, ఈ పరికరాలు లేకపోతే నెల రోజుల పడుతుందని చెప్పారు. మొదటి ఏడాది సుమారు 1,500 కిలోల వక్కలు పండాయని, వాటిని పశ్చిమ గోదావరి జిల్లా అంబాజీపేటలో కిలో రూ.160 చొప్పున అమ్మినట్లు తెలిపారు. వారు వాటిని శుద్ధి చేసి కేరళ, తర్వాత విదేశాలకు ఎగుమతి చేస్తారని అన్నారు. తాను పూర్తి స్థాయిలో వక్కలు తీయనందున (శుద్ధి) రూ. 160 వచ్చిందని.. పూర్తి స్థాయిలో పొట్టు వేరు చేసి, వక్కలు మాత్రమే అమ్మితే బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.350–రూ.400 పలుకుతుందన్నారు. మొదటి ఏడాది తనకు రూ.2.50 లక్షల ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది మరో రూ.3లక్షల నుంచి రూ.4లక్షలు వచ్చే అవకాశం ఉందన్నారు.


అంతర పంటగా సుగంధ ద్రవ్యాలు

వక్క తోటలోనే పలు సుగంధ ద్రవ్యాలు సాగు చేస్తున్నారు. మిరియాలు, యాలకులు, జాజికాయ, జాపత్రి, లవంగాలు, అల్లంతో పాటు ఆపిల్‌, ద్రాక్ష, బ్లూ బెర్రీ, బ్లాక్‌ బెర్రీ, అవకాడో, మ్యాంగో, జామ వంటి పండ్ల మొక్కలు పెంచుతున్నారు. మరో ఏడాదిలో పండ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

నాటిన ఆరేళ్ల నుంచి పంట

వక్క పంట చేతికి రావడానికి మొదటగా ఆరేళ్ల సమయం పడుతుంది. ఆరేళ్లపాటు మొక్కకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందించాల్సి ఉంటుంది. తర్వాత 50 ఏళ్ల వరకు దాని జీవితకాలం ఉంటుంది. 2017లో మొక్కలు నాటితే 2023లో పంట 40 శాతం మేర చేతికి వచ్చిందని.. సుమారు 1,500 కిలోలు ఉత్పత్తి అయినట్లు విజయ్‌కుమార్‌ తెలిపారు. రెండో ఏడాది 60 నుంచి 70 శాతం, మూడో ఏడాది 70 నుంచి 90 శాతం, నాలుగో ఏడాది 100 శాతం పంట వస్తుందన్నారు. మొక్క నాటిన నుంచి పూర్తి స్థాయిలో పంట రావడానికి పదేళ్ల సమయం పడుతుందన్నారు.

నేర్పేందుకు సిద్ధం



రాష్ట్రంలో అవకాశం ఉన్న రైతులంతా వక్క పంటను సాగు చేసుకోవచ్చు. దీన్ని పండించడం చాలా సులువు. ఆసక్తి గలవారికి మెలకువలు నేర్పేందుకు సిద్ధం. ఇప్పటికే చాలామంది వచ్చి తెలుసుకొని వెళ్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి, రైతులకు తోడ్పాటు అందించాలి.

– డా. విజయ్‌కుమార్‌, విశ్రాంత వైద్యుడు



చెట్టు నుంచి వక్కలను కోస్తున్న దృశ్యం

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

కామన్‌ డైట్‌లో బలవర్ధకమైన ఆహారం

- శాసనసభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌

అనంతగిరి: ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని అసెంబ్లీ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ అన్నారు. శనివారం వికారాబాద్‌ పట్టణం ఎన్నెపల్లి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్‌ ప్రభుత్వం చేపట్టిన కామన్‌ డైట్‌ ప్లాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్‌ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా డైట్‌, కాస్మోటిక్‌ చార్జీలు పెంచారన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకుని ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలన్నారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్‌ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు వీలుగా ప్రభుత్వం కామన్‌ డైట్‌ ప్లాన్‌ను ప్రారంభించిందన్నారు. దీంతో పిల్లలకు పోషకాలతో కూడిన బలవర్ధక ఆహారం అందుతుందన్నారు. విద్యార్థులు మరింత మెరుగైన విద్యను అభ్యసించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాన్నారు. ఏకాగ్రతతో చదువుకుని ఉన్నతంగా స్థిరపడి తల్లిదండ్రులు, గురువులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మైనార్టీ గురుకులానికి త్వరలోనే ప్రభుత్వ స్థలంలో నూతన భవనం నిర్మాణం చేపడతాన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్యం పైనే నిధులు వెచ్చిస్తుందన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతం

అనంతరం జిల్లా కలెక్టర్‌ ప్రతీక్‌ జైన్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్‌, తెలుగులో ఉపన్యసించడంపై కలెక్టర్‌ అభినందించారు.కమ్యూనికేషన్‌ స్కిల్స్‌పై ప్రత్యేక కార్యక్రమం చేపట్టడం హర్షనీయమన్నారు. అనంతరం స్పీకర్‌ స్టోర్‌ రూంను సందర్శించి సన్న బియ్యం నాణ్యతను తనిఖీలు చేపట్టారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి,మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల, ఆర్డీఓ వాసుచంద్ర, వైస్‌ చైర్మన్‌ శంషాద్‌బేగం, ఫ్లోర్‌ లీడర్‌ సుధాకర్‌రెడ్డి, డీసీ సీబీ డైరెక్టర్‌ కిషన్‌ నాయక్‌,కౌన్సిలర్లు మంజుల రెడ్డి, చందర్‌నాయక్‌, ప్రిన్సిపాల్‌ మహబూబ్‌ పాతిమా, సీనియర్‌ నాయకులు యండీ హఫీజ్‌, ఎర్రవల్లి జాఫర్‌,రత్నారెడ్డి,రాంచంద్రారెడ్డి,అనంత్‌రెడ్డి, రెడ్యానాయక్‌, రమేష్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



కామన్‌ డైట్‌ ప్లాన్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌, కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌, ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు: బీఎంఆర్‌



తాండూరు: మైనార్టీ బాలికల స్కూల్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, సబ్‌-కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌

తాండూరు: ఏడాది ప్రజాప్రభుత్వ పాలనలో విద్యావస్థలో వస్తున్న విప్లవాత్మక మార్పును చూసి ఓర్వలేకే కొన్ని దుష్టశక్తులు విద్యార్థులపై విషం చిమ్ముతున్నాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మైనార్టీ బాలిక రెసిడెన్షియల్‌ పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాటికొండ స్వప్నపరిమళ్‌, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సబ్‌–కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌లతో కలిసి డైట్‌, స్టోరేజ్‌ ప్రొటోకాల్‌ క్యాట్‌లాగ్‌ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వ సదుపాయాలు అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యావ్యవస్థ బలోపేతానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం దక్షతతో పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులకు 40శాతం డైట్‌, 200శాతం కాస్మాటిక్‌ చార్జీలు పెంచారని గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ రాష్ట్ర భవిష్యత్‌గా భావించి ఏడు శాతం నిధులు కేటాయించిన ఘనత ప్రజాప్రభుత్వానిదే అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విద్య, వ్యవసాయ రంగాలు కీలకమన్నారు. ఈ రెండు రంగాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకన్నగౌడ్‌, నీరజాబాల్‌రెడ్డి, మమత, నాయకులు డాక్టర్‌ సంపత్‌కుమార్‌, అబ్దుల్‌ రవూఫ్‌, జుబేర్‌లాల తదితరులున్నారు.

విద్యార్థుల కలలను నిజం చేస్తాం: టీఆర్‌ఆర్‌

పరిగి: విద్యార్థుల కలలను నిజం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ గురుకుల, హాస్టల్స్‌లలో మెస్‌, డైట్‌ చార్జీలు పెంచడంతో శనివారం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మె ల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు బలవర్ధక ఆహారం అందించేందుకు ప్రభుత్వం కామన్‌ డైట్‌ కార్యక్రమం చేపట్టిందన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చి హామీలన్నీ నెరవేర్చితీరుతామన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌, తహసీల్దార్‌ ఆనంద్‌రావు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్‌ సున్నం శ్రీనివాస్‌ రెడ్డి

అనంతగిరి: రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్‌ సున్నం శ్రీనివాస్‌ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వికారాబాద్‌ కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోక్‌ అదాలత్‌లో కేసులు రాజీ కుదుర్చుకుంటే ఇద్దరూ నెగ్గినట్లేనని అన్నారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య తగాదాలు, రహదారి ప్రమాదాలు, ఆస్తి, భూ, ఇతర తగాదాలకు సంబంధించిన 2,009 కేసులను పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్‌, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్‌, సీనియర్‌ సివిల్‌ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రత్యేక ద్వితీయశ్రేణి న్యాయమూర్తి నామాల అశోక్‌, జూనియర్‌ న్యాయమూర్తి శ్రీకాంత్‌, అదనపు జూనియర్‌ న్యాయమూర్తి శృతిదూత, ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌ రెడ్డి, ఏపీపీ సమీనాబేగం, బార్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ అశోక్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి డాక్టర్‌ సున్నం శ్రీనివాస్‌ రెడ్డి

పరిగిలో..

పరిగి: లోక్‌ అదాలత్‌లో మొత్తం 201 కేసులను ఇరువురి రాజీ ద్వారా పరిష్కరించారన్నారు. ఈ సందర్భంగా పరిగి జూనియర్‌ సివిల్‌ కోర్టు జడ్జి నాగుల శిల్పా మాట్లాడుతూ పంతాలకు పోయి గొడవలు పెంచుకోవద్దని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులు పలు కేసులకు దారితీస్తాయన్నారు. ఎలాంటి కేసులైన లోక్‌ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఇరువురి రాజీతో కేసుల సమస్యలు తక్షణమే పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌, బార్‌అసోషియేషన్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి భక్తకుమార్‌, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ప్రభుత్వ విద్యాలయాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎంసీహెచ్‌లో ప్రత్యేకంగా వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌ దర్మిది రవిశంకర్‌ను కోరారు. అయితే బయట నుంచి తెచ్చుకున్న తినుబండాలతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని వైద్యాధికారులు ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్న, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్‌ వెంకన్నగౌడ్‌ తదితరులు ఉన్నారు.



విద్యార్థినికి ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌ఓసీ అందజేత

తాండూరు: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాధితుల కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌ఓసీ అందజేశారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సాయిపూర్‌కు చెందిన నశ్రత్‌ఫాతిమాకు రూ.2.50లక్షలు, యాలాల మండలం కోకట్‌ గ్రామానికి చెందిన బిపాషా అనారోగ్యానికి గురైందని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆమె శస్త్ర చికిత్స నిమిత్తం రూ.3.20లక్షల ఎల్‌ఓసీని అందజేశారు.



బాధితుల కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

కొడుకులు జవాన్లు.. తల్లిదండ్రులు కిసాన్లు

- ఒకేతండా నుంచి సీఆర్‌పీఎఫ్‌ జవాన్లు
- ఆనందంలో గిరిజనులు

బొంరాస్‌పేట: వ్యవసాయం, కూలీ చేసే కుటుంబ నేపథ్యం కలిగి ఒకే తండానుంచి జవాన్లుగా ఎంపికయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధిలోని బాపన్‌చెర్వుతండా గిరిజన గ్రామపంచాయతీ పరిధిలోని భీక్యానాయక్‌తండాకు చెందిన ఇద్దరు యువకులు విజయభాస్కర్‌, దేవేందర్‌లు సీఆర్‌పీఎఫ్‌ జవాన్లుగా ఉద్యోగం సాధించారు. తండాకు చెందిన ఉమ్లీబాయి, కిషన్‌నాయక్‌ల కొడుకు విజయభాస్కర్‌, మాణికిబాయి, రాములు కొడుకు దేవేందర్‌లు డిగ్రీ వరకు చదువుకొని తాజాగా సీఆర్‌పీఎఫ్‌ జవాన్లుగా ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీంతో తండావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



విజయభాస్కర్‌



దేవేందర్‌

సీఐఎస్‌ఎఫ్‌ జవాన్‌గా గిరిజన యువకుడు

తండాల్లో వెల్లువెత్తిన అభినందనలు

దుద్యాల్‌: మండల పరి ధి లోని రక్తమైసమ్మ తండాకు చెందిన ఓ యువకుడు సీఐఎస్‌ఎఫ్‌ జవాన్‌గా ఎంపికయ్యాడు. తండాకు చెందిన రాము నాయక్‌, మునిబాయిల పెద్ద కుమారుడు సురేశ్‌ కొంత కాలంగా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. అనేక సార్లు ప్రయత్నం చేసిన అనంతరం ఇటీవలే విడుదలైన ఫలితాల్లో సీఐఎస్‌ఎఫ్‌కు ఎంపికై నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను తండాలో పలువురు అభినందించారు.



సురేశ్‌

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ

అనంతగిరి: కేంద్రంలోని అధికార బీజేపీ కార్మికుల హక్కులను కాలరాస్తు, కార్పొరేట్‌కు కొమ్ముకాస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణజ్యోతి పేర్కొన్నారు. శనివారం వికారాబాద్‌లోని క్లబ్‌ ఆవరణలో వామపక్షపార్టీల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలను పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విద్వేశ శక్తుల ఆగడాలను అడ్డుకట్ట వేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీపీఐఎంఎల్‌ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మహేందర్‌, గీత, బుగ్గయ్య, రాములు, శ్రీనివాస్‌నాయక్‌, శ్రీకాంత్‌, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాలికకు పరామర్శ

ఆరోగ్యపరిస్థితిపై తెలుసుకున్న మండలి చీఫ్‌ విప్‌ మహేందర్‌రెడ్డి



లీలావతిని పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు: గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం భుజించి అస్వస్థతతో నిమ్స్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక లీలావతిని మండలి చీఫ్‌ విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. శనివారం ఆయన లీలావతి ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి ఆర్‌ఎంఓను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యార్థినికి ధైర్యం చెప్పారు. వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారని రెండు రోజుల్లో ఇంటికి వెళ్తారని బాలిక తండ్రి ధారాసింగ్‌కు మహేందర్‌రెడ్డి ధైర్యం చెప్పారు.

యాలాల వాసికి సీఐఎస్‌ఎఫ్‌ ఉద్యోగం

యాలాల: సీఐఎస్‌ఎఫ్‌(సెంట్రల్‌ ఇండస్ట్రీయల్‌ సెక్యూరిటీ ఫోర్స్‌) కానిస్టేబుల్‌ ఉద్యోగానికి యాలాలకు చెందిన యువకుడు నవీన్‌కుమార్‌ ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన బుర్నపురి నర్సింహులు, పుష్పమ్మ దంపతుల కుమారుడు బుర్నపురి నవీన్‌కుమార్‌ శుక్రవారం వెలువడిన ఫలితాల్లో 160 మార్కులకు గాను 110 మార్కులు సాధించి సీఐఎస్‌ఎఫ్‌ కానిస్టేబుల్‌ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నవీన్‌ మొదటి ప్రయత్నంలోనే కానిస్టేబుల్‌ ఉద్యోగానికి ఎంపికవ్వడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



నవీన్‌కుమార్‌

మాజీ వార్డు సభ్యుడు మృతి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారానికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు ముసులగళ్ల శ్రీనివాస్‌ అనారోగ్యంతో మృతి చెందాడు. మూడు నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం హైదరాబాద్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం అంత్యక్రియలు గ్రామంలో నిర్వహించారు. పలువురు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకుడు గోవింద్‌రెడ్డి, శ్యామలయ్యగౌడ్‌, కాంగ్రెస్‌ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప, గుండప్ప, భవన నిర్మాణ సంఘం తాలూకా అధ్యక్షుడు మొగులయ్య హాజరయ్యారు.



శ్రీనివాస్‌ (ఫైల్‌)